నేడు నాగ్‌పూర్‌కు సిఎం రేవంత్

80వేల మంది ర్యాలీలో పాల్గొంటారు: మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగ్‌పూర్‌లో ఆ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ముఖ్యనేతలు బయలుదేరారు. ఆ ర్యాలీని విజయవంతం చేసేందుకు రాష్ట్రం నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి 80వేల మందిని తరలిస్తున్నట్టు టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. పార్టీ నేతలు మల్లు రవి, కుసుమ కుమార్, నిజాముద్దీన్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఇప్పటికే నాగ్‌పూర్‌కు చేరుకుని తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

కాంగ్రెస్ నాయకులు సంధాన కర్తలుగా ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న తరుణంలో ప్రజలకు, ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సంధాన కర్తలుగా ఉండాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం మొదలైందనీ, ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలతోపాటు రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పథకాలు అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలులోకి రాబోతున్నాయన్నారు.

కొటాక్ మహీంద్రా బ్యాంక్ చైర్మన్‌గా సిఎస్ రాజన్

హైదరాబాద్ : కొటాక్ మహీంద్రా బ్యాంక్ నూతన పార్ట్ టైం చైర్మన్‌గా సిఎస్ రాజన్ నియామకానికి ఆర్‌బిఐ ఆమోదం తెలిపింది. ఆయన నియామకం 2024 జనవరి 1 నుంచి రెండేళ్లపాటు అమల్లో ఉంటుంది. 1978 ఐఎఎస్ ఆఫీసర్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఆ బ్యాంక్‌కు ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు.

గడీల పాలన కాదు...

ఇందిరమ్మ ప్రజా పాలన

- నిస్సహాయులకు సాయం చేయడమే మా లక్ష్యం
- పకడ్బందీగా ఆరు గ్యారంటీల అమలు
- నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో కొత్త రేషన్‌కార్డులు
- టిఎస్‌పిఎస్‌సికి త్వరలో కొత్త చైర్మన్
- కెసిఆర్ కుటుంబం దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తాం : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"గడీల నుంచి పరిపాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చాం. నిస్సహాయులకు సాయం చేయడమే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగానే పాలన ఉంటుంది" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన - ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారాన్ని బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు తెలంగాణ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం... ప్రజలకు మంచి పాలన అందించడమే మా లక్ష్యం అని సిఎం స్పష్టం చేశారు. గత పదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేదనీ, అందుకు ప్రజావాణీలో వచ్చిన 24 వేల ఫిర్యాదులే ఉదాహరణ అని చెప్పారు. గత సర్కార్ హయాంలో ప్రజలు తమ సమస్యలపై ప్రభుత్వం దగ్గరకు వస్తే గడీలు అడ్డుగోడలుగా ఉండేవి... ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల వద్దకు నడిచి వెళ్తోందన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ ఆరు గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరించే సదుపాయాన్ని కల్పిస్తున్నాం.. జనవరి ఆరు తర్వాత కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు... గడువు తరువాత ఎంపిడిఓ, ఎంఆర్‌ఓ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నాం... ఎవరూ ఆందోళన చెందొద్దు.. రేషన్ కార్డులు లేని వారి దరఖాస్తును కూడా స్వీకరిస్తాం... కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ... గ్రామ సభల్లో అన్ని రకాల దరఖాస్తులను స్వీకరిస్తాం... జనవరి 7 లోపు లబ్ధిదారుల వివరాలను సేకరిస్తాం" అని సిఎం వివరించారు. మహాలక్ష్మి పథకంతో ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు త్వరలో ఆర్థిక సహాయం ప్రకటిస్తామని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్ట్‌పై విచారణ కొనసాగుతోందని, దోషులెవరిని వదలబోమని హెచ్చరించారు. రైతు బంధుపై ఎలాంటి సీలింగ్ పెట్టే ఆలోచన ప్రస్తుతానికి లేదనీ, మంత్రి వర్గంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనూ డిసెంబర్ 20 నుంచి మార్చి 30వ తేదీ వరకు విడతల వారీగా రైతు బంధు డబ్బులు జమ చేస్తూ వచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అర్హులైన ప్రతి రైతుకు రైతుబంధు పథకం డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన రాష్ట్ర వాటా కోసం ప్రధానితో పాటు ఎవరినైనా కలవడానికి సిద్ధంగా ఉన్నామనీ, తమకు బేషజాలు లేవని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను దివాళా తీయించిందని, దాన్ని అధిగమించేందుకు దుబారాను తగ్గించడంతో పాటు ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తామని తెలిపారు. మీడియా కోసం సచివాలయంలో ప్రత్యేక గదిని కేటాయించనున్నట్టు తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రకటించారు.

త్వరలో జాబ్ క్యాలెండర్

ఎన్నికల ముందు తెలంగాణ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, డిసెంబర్ 2024 కల్లా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సిఎం తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, సభ్యులు ఇప్పటికే రాజీనామా చేశారనీ, వారి రాజీనామాలను గవర్నర్ ఆమోదించిన మరుక్షణమే కొత్త చైర్మన్, సభ్యులను నియమిస్తామని పేర్కొన్నారు. చైర్మన్, సభ్యుల నియామకం తరువాత ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతుందన్నారు. నిరుద్యోగులు ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. గ్రూప్-2 నిర్వహణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

కెసిఆర్ కుటుంబం ప్రజల రక్తాన్ని దోచుకుంది

కెసిఆర్ కుటుంబం ప్రజల రక్తం పిండి ఆస్తులు సంపాదించిందని సిఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే భవనాలను కూల్చి కమీషన్ల కోసం కొత్తవి కట్టారని దుయ్యబట్టారు. ప్రజావాణిలో న్యాయం జరగలేదంటూ ఓ మహిళకు మాజీ మంత్రి కేటీఆర్ రూ.లక్ష అందించారని ప్రచారం చేసుకుంటున్నారనీ, అయితే ఆ మహిళకు లక్ష రూపాయలు ఇప్పించడంలో ప్రజావాణి విజయవంతమైందని సిఎం అన్నారు. కెటిఆర్ దోచుకున్న లక్ష కోట్లల్లో లక్ష రూపాయలే పంచారనీ, మిగతా డబ్బులు కక్కిస్తామని అన్నారు. 22 కొత్త ల్యాండ్ క్రూజర్ వాహనాలు కొని విజయవాడలో దాచిపెట్టారని విమర్శించారు. ఓటమి జీర్ణించుకోలేక కెటిఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐటిఐఆర్, సైనిక్ స్కూల్ గురించి అడగని వినోద్ కుమార్ బుల్లెట్ ట్రైన్ గురించి మాకు నీతులు చెబుతున్నారని విమర్శించారు.

మెగా డిఎస్‌సిని ప్రకటించాలి

- శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కు డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రులు డి శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని తెలిపారు. మిగిలిన 15 వేల పోస్టులను కలిపి 20 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సిని ప్రకటించాలని కోరామన్నారు. మెగా డిఎస్‌సి ప్రతిపాదన ప్రభుత్వం దృష్టిలో ఉందనీ, కొంత సమయం తీసుకుని నోటిఫికేషన్‌ను జారీ చేస్తామంటూ మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం సభ్యులు హరీశ్, ఆదిత్య, శ్రీనివాస్, శ్రీనునాయక్, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి వినతి

15 వేల ఉపాధ్యాయ పోస్టులను కలిపి డిఎస్‌సి అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను బుధవారం తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాతపరీక్షల తేదీలను ప్రకటించాలనీ, ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో ముడిపెట్టకుండా మెగా డిఎస్‌సి ప్రకటించాలని సూచించారు. డిఎస్‌సిపై ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నాయనీ, ముఖ్యమంత్రితో సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని బుర్రా వెంకటేశం హామీ ఇచ్చారని తెలిపారు.

గ్రూప్ పరీక్షలపై ప్రభుత్వం స్పందించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్స్ రాత పరీక్షల నిర్వహణ, పరీక్షల రీషెడ్యూల్, జాబ్ క్యాలెండర్ అంశాలపై నిరుద్యోగుల్లో నెలకొన్న గందరగోళంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 పోస్టుల భర్తీ ప్రక్రియ లీకేజీ కారణంగా వాయిదా పడి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. వచ్చే నెల ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను నిర్వహించాలని టిఎస్‌పిఎస్‌సి నిర్ణయించిందని పేర్కొన్నారు. చైర్మన్, సభ్యుల రాజీనామాతో ఆ పరీక్షలు జరుగుతాయా? లేదా? అనే ఆందోళనలో నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు. గ్రూప్-4 ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. అభ్యర్థుల్లో ఉన్న అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాల్సిన అవసరముందని సూచించారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. టిఎస్‌పిఎస్సి ప్రక్షాళన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

ఎల్‌బి నగర్‌లోని పిఎన్‌బి శాఖ తరలింపు

హైదరాబాద్ : ఎల్‌బి నగర్‌లోని ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ను కొత్త ప్రాంతంలోకి మార్చారు. శివ గంగా కాలనీలోని శాఖను కొత్తగా మన్సూరాబాద్ మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసింది. ఈ నూతన శాఖను బుధవారం పిఎన్‌బి హైదరాబాద్ జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవా లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ హెడ్ ఎన్‌విఎస్‌పి రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ జివి వెంకన్న, ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అ సందర్భంగా రూ.4 కోట్ల విలువ చేసే వివిధ రుణాలను శ్రీవాస్తవా గ్రహీతలకు అందజేశారు.

మన్సూరాబాద్ మెయిన్ రోడ్‌లోని కొత్త పిఎన్‌బి శాఖ ప్రారంభిస్తున్న శ్రీవాస్తవా

ప్రజాపాలనకు నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల వారిగా నోడల్ అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌కు కె.నిర్మల, వరంగల్‌కు వాకాటి కరుణ, ఖమ్మంకు రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్‌కు టికె.శ్రీదేవి, కరీంనగర్‌కు శ్రీదేవసేనను నియమించారు. రంగారెడ్డికి ఇ.శ్రీధర్, మెదక్‌కు ఎస్.సంగీత, అదిలాబాద్‌కు ఎం.ప్రశాంతి, నల్గొండకు ఆర్‌వి.కర్నన్, నిజామాబాద్‌కు క్రిష్టినాకు బాధ్యతలు అప్పగించారు.

IN THE COURT OF THE SMALL CAUSES JUDGE AT BANGALORE. (SCCH 6)
SC No.901/2021
(Summons for Service by Advertisement in a News Paper) (Order 5 Rule 20)

BETWEEN: THE CANARA BANK GOLDEN JUBILEE STAFF WELFARE FUND, No.14, M.G. ROAD, NAVEEN COMPLEX, BANGALORE-560 001. (Represented by its Secretary R. P. Pradeep Kumar) ....**PLAINTIFF**

AND: Sri. SRINIVAS REDDY KUTHURU ...DEFENDANT

SUMMONS To: **SRI. SRINIVAS REDDY KUTHURU,** Father's Name not known to the Plaintiff Major, Ex-Employee, Canara Bank, Residing at No:1-94/8, 1st Floor, Street No:1, Bhavani Nagar, Nucharam, HYDERABAD.

WHEREAS the Plaintiff has instituted a suit against you for the recovery of a sum of Rs. 94,680/- (Rupees Ninety Four Thousand Six hundred Eighty only), you are hereby summoned to appear in this Court in person or by pleader duly instructed and able to answer all questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on **29-01-2024** 11:00 A.M. in the forenoon to answer the claim. If you fail to appear on the day mentioned above, the case will be heard and determined in your absence.

Given under my hand and the seal of the court on 26-12-2023.

By order of the court, Assistant Registrar, City civil court at Bangalore.

Advocate for Plaintiff:
B. SUBRAYA KHARVI
No.231, 11th main 37th Cross, 4T Block, Jayanagar, Bangalore-560041.

పథకాలు అందరికీ చేరువయ్యేందుకే..

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరువచేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్టు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. బుధవారం తెలంగాణలోని వివిధ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమైంది. ఈ మేరకు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ హైదరాబాద్‌లోని లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందించే వీడియో వ్యాన్‌ను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు కష్టపడకుండా ఉండాలని పిఎం ఉజ్వల యోజన ద్వారా వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్ ద్వారా నిరుపేదలకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించారన్నారు. తెలంగాణలో ఈ యాత్ర 2024 జనవరి 25 వరకు కొనసాగనుందన్నారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వ సమాచారంతో కూడిన ఐఇసి మెటిరియల్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను గవర్నర్ సందర్శించారు.

పారితోషికాలు చెల్లిస్తాం

- ఆశాలకు కమిషనర్ హామీ : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశావర్కర్లకు నవంబర్ నెల పారితోషికం గురు, శుక్రవారాల్లో జమచేస్తామని వైద్యారోగ్య కమిషనర్ హామీనిచ్చారని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఈ మేరకు వారు వైద్యారోగ్య శాఖ కమిషనర్ కర్నన్‌కు వినతిపత్రం అందజేశారు. అక్టోబర్ 9న హెల్త్ డైరెక్టర్ ఇచ్చిన హామీల గురించి కమిషనర్ వద్ద ప్రస్తావించారు. రూ.18 వేల వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపు, ప్రమాద బీమా రూ.5 లక్షల చెల్లింపు, రిటైర్డ్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, సంక్షేమ పథకాల వర్తింపు, తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఆరు నెలల ఏరియర్స్‌ను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నవంబర్ నెల పారితోషికాలు వెంటనే అకౌంట్లలో వేస్తామనీ, ఇన్సూరెన్స్, తదితర డిమాండ్లను పరిశీలిస్తామనీ, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని కమిషనర్ హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కవిత, ఎ. హేమలత, రాష్ట్ర నాయకులు ఎం.మీనా, ఎం.రేవతి, ఎ.శ్రీదేవి ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఒకే వేదికపై 500 పైగా స్వీట్స్

- కలనరీ అకాడమీలో ప్రదర్శన

హైదరాబాద్ : ఒకే వేదికపై దాదాపు 500పైగా రకాల భారతీయ స్వీట్స్‌ను ప్రదర్శించారు. నగరంలోని బేగంపేటలోని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా భారీ స్థాయిలో స్వీట్స్‌ను తయారు చేసి వీక్షకులను ఆశ్చర్యపోయేలా చేశారు. 350 మంది విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు 72 గంటలపాటు శ్రమించి వీటిని తయారు చేశారని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చెఫ్ అక్షయ్ కులకర్ణి తెలిపారు.

తెలంగాణకు అప్పులు

- కెసిఆర్ కుటుంబానికి ఆస్తులు
- శ్వేద పత్రాలు కాదు.. సౌదపత్రాలు రిలీజ్ చేయాలి
- రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాధించుకున్న తెలంగాణను అప్పులపాలు చేసిన కెసిఆర్ కుటుంబానికి ఆస్తులు మాత్రం భారీగా పెరిగాయని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 రోజులు కాలేదని, అంతలోనే బిఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని శ్వేదపత్రంతో విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణపై శ్వేదపత్రాలు కాదు.. కల్వకుంట్ల కుటుంబానికి ఆస్తులు ఎలా పెరిగాయో, ఫామ్‌హౌస్, ఇళ్ల విలువ వందల కోట్లు ఎలా వచ్చాయో సౌద పత్రాలు విడుదల చేయాలన్నారు. 20 రోజుల్లో రెండు హామీలను నెరవేర్చామని అన్నారు. ప్రజా పాలనలో సమస్యపై దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ రసీదు తీసుకోవాలని తెలిపారు. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచామన్నారు. నాలుగు కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌తో ప్రయాణం చేశారన్నారు. మహిళలు ఊహించని విధంగా ఉచిత ప్రయాణంపై అనూహ్య స్పందన వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. కొన్ని రూట్లలో బస్సులు కావాలని నా దృష్టికి వచ్చిందని, త్వరలోనే కొత్త బస్సులు తీసుకొచ్చి అన్ని రూట్లలో బస్సులు వేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పరిస్థితి చూస్తే రూ.7 లక్షల కోట్ల అప్పులతో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు.

ఉద్యోగుల జీతాలు ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తీసుకునే రోజులు వస్తున్నాయన్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు భాగస్వాములు కావాలన్నారు. స్వేచ్ఛ ఇస్తున్నామని.. మీకు ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, చిత్తారి పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాగ్దానం అమలు చేస్తాం

- చివరి ఇంటి వరకు పథకాలు చేరుస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తప్పకుండా నెరవేరుస్తామని, ప్రతి చివరి ఇంటి వరకు ప్రభుత్వ పథకాలు చేరే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. రాష్ట్రంలో నూతన ప్రజా పాలన ప్రారంభమైందని ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసమే ఈ నెల 28 నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. బుధవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అనేక హామీలు గుప్పించి వాటిని ఎగ్గొట్టిందని విమర్శించారు. నిరుద్యోగభృతి, పోడు భూములకు హక్కుపత్రాలు, అసైన్డ్ భూములకు హక్కులు, రుణమాఫీతోపాటు కేంద్రం చెప్పిన 2 కోట్ల ఉద్యోగాలు అమలు చేయలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దుల్లా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు అని.. ప్రస్తుతం ప్రభుత్వానికి ప్రజలంతా ఒకటేనని స్పష్టంచేశారు. ప్రభుత్వం గురువారం నుంచి ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటుందని చెప్పారు. అధికారులే గ్రామాలకు వచ్చి ప్రజల నుంచి వీటిని స్వీకరిస్తారని, దరఖాస్తులు ముందుగానే పూరించి అధికారులకు అందజేస్తే బాగుంటుందని వివరించారు. ఎవరైనా తమ గ్రామానికి రాలేదని ఇబ్బందులు పడకూడదని, మండల కార్యాలయాల్లోనూ అందజేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే సమస్యలు గుర్తించామని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదివాసీల పోడు భూములకు హక్కుపత్రాలు అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

విలేకరులు ఉద్యమకారులే..!

విలేకరులు కూడా ఉద్యమకారులేనని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క చెప్పారు. జర్నలిస్టులకు సంబంధించి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తోందని వివరించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, గడ్డం వినోద్, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ప్రణాళిక

- అంతిమ లబ్ధిదారులు ప్రజలే
- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరు గ్యారంటీల అమలు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో ప్రజాపాలన, ఆరుగ్యారంటీల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగమంతా సమాయత్తం కావాలని ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఆరు గ్యారంటీలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, దరఖాస్తులు తీసుకోవాలని తెలిపారు. పథకాల రూపకల్పన, విధివిధానాలను ప్రభుత్వం రూపొందిస్తే వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అంతిమ లబ్దిదారులు ప్రజలేనని, అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందినప్పుడే.. సార్థకత చేకూరుతుందని చెప్పారు. యావత్ తెలంగాణ ప్రజలు సంఘటితమై కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, కాబట్టి వారికి ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత తమపై ఉందని, అందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన కారక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి దరఖాస్తు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పోలీస్ యంత్రాంగం కూడా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు
కర్నూలు అట్ ఆదోని
O.S.No. 03/2022

Between:
శ్రీమతి వెంకటలక్ష్మీ కుల్కర్ణి@ సజ్జలగుడ్డం వెంకటలక్ష్మీ మరియు సజ్జలగుడ్డం రామ్ గోపాల రావు ..... వాదులు

V/s.

సజ్జలగుడ్డం రామచంద్రరావు మరియు 16 ఇతరులు ..... ప్రతివాదులు

ప్రతివాదులైన నెం.7, 8, 9 లకు దావా సమన్లు

To.
1. సజ్జలగుడ్డం పద్మప్రియ D/o లేట్ సుమంతరావు, W/o గోపాలకృష్ణ, (Defendant No.7) R/o ఫ్లాట్ నెం.4, కృపా అపార్ట్మెంట్స్, వెస్ట్ మారెడ్పల్లి, సికింద్రాబాద్-500028,
2. సజ్జలగుడ్డం సత్య గోపాల్ S/O లేట్ సుమంతరావు, (Defendant No.8) R/o ఇంటి నెం. 42-260-64, మౌలాలి, హైదరాబాద్-500040.
3. సజ్జలగుడ్డం ఇందిరాబాయి D/O లేట్ గోపాలరావు, W/o లేట్ జె. మల్లారావు, (Defendant No.9) R/o డోర్ నెం.4-22-3ఎ, గుడ్షెఫ్డ్ స్కూల్ దగ్గర, బాలాజి నగర్, కర్నూలు-518006.

పై తెలిపిన వాదులు, ప్రతివాదులు అయిన మీపై మరియు మరో 14 మందిపైన పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టు నుండి ప్రతివాదులు అయిన మీకు చాలా సార్లు సమన్లు పంపినను తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై దావా తేది: 10-01-2024 ఉదయం 10.30 గంటలకు ప్రతివాదులు అయిన మీరు కోర్టుకు హాజరు కావలెనని, మీ తరఫున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు ఖుద్దుగా గాని, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. ప్రతివాదులు అయిన మీరు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో వాదుల పరముగా మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

వాయిదా తేది : 10-01-2024

శ్రీ కె. విజయభాస్కర్ రెడ్డి,
వాది తరపు వకీలు,
ఆదోని-518301.

ఉన్నది ఉన్నట్టుగా ప్రజల ముందుంచుదాం

- ప్రజలకు జవాబుదారీగా వార్షిక బడ్జెట్
- ఆర్థిక శాఖ సమీక్షా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సవాళ్లు, ప్రభుత్వం ముందున్న లక్ష్యాలకు సంబంధించి ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకు చెప్పేద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. అసలైన తెలంగాణ ఇప్పుడే వచ్చిందనుకుని బడ్జెట్ తయారు చేయాలంటూ ఆయన వారిని ఆదేశించారు. దుబారా చేయకుండా, వృధా ఖర్చులు తగ్గించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆదాయ వ్యయాల వాస్తవికతను ప్రతిబింబించేలా రూపొందించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సిఎం రేవంత్... ఆ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లను నూటికి నూరు పాళ్లూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. లేనిపోని గొప్పలు, ఆర్భాటాలకు పోకుండా వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించాలని అన్నారు. వాస్తవంగా రాష్ట్ర ఆదాయమెంత..? ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, చేయాల్సిన పనులకు ఎంత ఖర్చవుతుందనే అంశాలపై పక్కాగా అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. అప్పులు, చెల్లించాల్సిన బకాయిలు, నెలవారీ ఖర్చులన్నింటిపై అధికారులకు స్పష్టత ఉండాలని అన్నారు. ఎలాంటి దాపరికం లేకుండా ఆధాయ వ్యయాల ముఖచిత్రం ప్రజలకు అర్థమయ్యేల ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. ఎవరో కొందరు వ్యక్తులను సంతృప్తిపరచాల్సిన అవసరం లేదనీ, అయితే తెలంగాణ ప్రజలను సంతృప్తి పరచాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వంపైన్నే ఉందని నొక్కి చెప్పారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రేవంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన గురుతరమైన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. అందుకే ప్రజా కోణంలో బడ్జెట్ ఉండేలా ప్రత్యేక కసరత్తులు చేయాలని కోరారు. గతంలో మాదిరిగా అప్పులు దాచి, ఆదాయ వ్యయాలను భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేనే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయ స్థితిగతులపై ఉన్నది ఉన్నట్టుగా జనం ముందు ఉంచాలని సూచించారు. అడ్డగోలు ఖర్చులు, అనవసర వ్యయం, దుబారా లేకుండా చూడాలని కోరారు. తప్పనిసరైతే తప్ప ప్రభుత్వం తరపున ఇచ్చే ప్రకటనలు కూడా తగ్గించాలని కోరారు. కొత్త వాహనాలను కొనుగోలు చేయకుండా, ఇప్పుడు ఉన్న వాటినే వినియోగించుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో గెలవకముందే 22 ల్యాండ్ క్రూయిజర్లను కొనుగోలు చేసిన విషయం ఈ సందర్భంగా చర్చకొచ్చింది. కొంతమేరకు రాష్ట్రం తన వాటాను చెల్లిస్తే కేంద్రం తన వాటాగా ఇచ్చే నిధులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పేరు వస్తుందనో లేదా రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా పేరు రాదనే విధంగా బేషజాలకు పోవద్దని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా బడ్జెట్ కసరత్తులు చేపట్టాలంటూ ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి టీకే శ్రీదేవి, సంయుక్త కార్యదర్శి కె.హరిత, డిప్యూటీ సిఎం ఒఎస్‌డి కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటాన్ అకౌంట్‌కు రంగం సిద్ధం

ఆర్థిక శాఖపై సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు రంగం సిద్ధమైనట్టేనని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. బడ్జెట్ ఎలా ఉండాలి? ఏయే ప్రాతిపదికల ఆధారంగా దాన్ని రూపొందించాలనే అంశంపై ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చిన దరిమిలా వాటికి అనుగుణంగా పద్దును రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పార్లమెంటు ఎన్నిలకు మార్చిలో నోటిఫికేషన్ రాబోతుందనే వార్తల నేపథ్యంలో అంతకుముందే ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఆ క్రమంలోనే సిఎం బడ్జెట్ రూపకల్పనపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

మంత్రి పొంగులేటికి టిబిజెఎల్ఎ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టిబిజెఎల్ఎ-475) అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి గురించి ప్రత్యేకంగా చర్చిద్దామంటూ మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిబిజెఎల్ఎ వర్కింగ్ ప్రెసిడెంట్ కెపి శోభన్‌బాబు, ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, మహిళా కార్యదర్శి సంగీత, విశాలాక్షి, నాయకులు కె శ్రీకాంత్, కృష్ణార్జునరావు, బుర్ర విజయమోహన్, గణపతి, హరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువతరానికి కొండా మాధవ రెడ్డి స్ఫూర్తి

- ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్

ప్రజాశక్తి - హైదరాబాద్

జస్టిస్ కొండా మాధవ రెడ్డి జీవితం యువతరానికి స్ఫూర్తి దాయకమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ తెలిపారు. మాధవరెడ్డి 100వ జయంతిని పురస్కరించుకొని బుధవారం హైదరాబాద్‌లో ఆయన గౌరవార్థం ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్ మాట్లాడుతూ కొండా మాధవరెడ్డి ఎపి, ముంబై హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేశారన్నారు. ఆయనను ఎప్పుడూ కలిసే అదృష్టం లభించలేదన్నారు. న్యాయ, విద్యా వ్యవస్థకు శాశ్వతమైన కృషి చేసిన దూరదృష్టి కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయన రచనలు, విలువలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ పివిఎస్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గడ్డపోతారంలో 'భూ గందరగోళం'

- తొమ్మిదెకరాల భూమిని టిఎస్ఐఐసికి కేటాయించారని.. భూముల స్వాధీనం కోసం అధికారుల రాక
- అడ్డుకున్న సంబంధిత సర్వే నెంబర్ బాధితులు
- తీవ్ర వాగ్వివాదం, పోలీసుల పహారాలో భూముల స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 27లో భూమికి సంబంధించి టీఎస్ఐఐసీ, రెవెన్యూ అధికారులు, స్థానికులకు మధ్య బుధవారం తీవ్ర వాగ్వివాదం నెలకొంది. సదరు సర్వేనెంబర్‌లో తొమ్మిదెకరాల భూమిని టిఎస్ఐఐసికి కేటాయించారంటూ.. భూ స్వాధీనం కోసం సంబంధిత అధికారులు బుధవారం గ్రామానికి వచ్చారు. అయితే తమకు కేటాయించిన భూమిని పరిశ్రమల పేరిట తిరిగి వేరే సంస్థలకు ఎలా కేటాయిస్తారని సంబంధిత సర్వేనెంబర్ బాధితులు అధికారులను అడ్డుకున్నారు. కొన్నేళ్ల క్రితమే తమకు కేటాయించిన భూములను వేరొకరి ఎలా అప్పగిస్తారంటూ ప్రశ్నించారు. కాగా, టిఎస్ఐఐసి అధికారులతో పాటు అక్కడి వచ్చిన పటాన్‌చెరు డిఎస్‌పి బాలాజీ నాయక్, బొల్లారం సిఐ

ముద్దీన్, ఎస్ఐలు, పోలీసులు సదరు భూముల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి భూములను స్వాధీనపరుచుకున్నారు. ఓ పక్క బాధితులు నిరసన తెలుపుతుండగా వారిని సముదాయిస్తూనే.. మరో పక్క సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని టిఎస్ఐఐసి బోర్డులు నెలకొల్పారు.

ఈ ఘటనపై జిన్నారం తహసీల్దార్ రవికుమార్ వివరణ కోరాగా.. సర్వేనెంబర్ 27కు సంబంధించి మొత్తం దాదాపు 65 ఎకరాలు ఉండగా.. మూడు దశాబ్దాల కిందట 59 ఎకరాలను కొంతమంది పేదలకు ప్రభుత్వం అసైన్ చేసిందని తెలిపారు. అయితే ఈ భూముల్లో కొంతమంది ఇటుక బట్టీలు, ఇతరత్రా వ్యాపార సంబంధిత వ్యవహారాలు కొనసాగిస్తున్నారన్నారు. దాంతో 2017లోనే ఈ 27 సర్వేనెంబర్ భూమిలో 9 ఎకరాలను టీఎస్ఐఐసీకి అప్పగించడం జరిగిందని చెప్పారు. సదరు భూమినే బుధవారం స్వాధీనం చేసుకున్నామన్నారు.

టిజిఒ కార్యవర్గం 31కి వాయిదా

- ప్రజాపాలన ప్రారంభం నేపథ్యంలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాపాలన ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం నిర్వహించతలపెట్టిన టిజిఒ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 31కి వాయిదా వేస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఆ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇందులో ఉద్యోగులు, అధికారులు బాధ్యతాయుతంగా పాల్గొనాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అండగా నిలవాలని సూచించారు. ఈ నెల 31న టిజిఒ కార్యవర్గ సమావేశంలో కొన్ని కీలకమైన నిర్ణయాలపై తీర్మానం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, వారి ప్రతినిధులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

రాచకొండలో ఆరు శాతం పెరిగిన నేరాలు

- 25 శాతం పెరిగిన సైబర్ నేరాలు
- భూ కబ్జాదారులు, లోన్‌యాప్ ముఠాలపై ప్రత్యేక నిఘా
- మహిళల భద్రతకు పెద్దపీట
- వార్షిక నేర నివేదిక విడుదల చేసిన సిపి సుధీర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈ సారి 6.86 శాతం నేరాలు పెరిగాయని పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. భూకబ్జాదారులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. లోన్‌యాప్ ముఠాల ఆగడాలను అరికడతామని, మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని చెప్పారు. సైబర్ నేరాలు 25 శాతం పెరిగాయని, మహిళలపై నేరాలు 6.65 శాతం తగ్గాయన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వార్షిక నేర నివేదికను హైదరాబాద్ నాగోల్‌లో జరిగిన దేవకి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సిపి సుధీర్ బాబు విడుదల చేసి వివరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాది 30,148 కేసులు నమోదు కాగా 2023 కేసులను ఛేదించారు. ఈ ఏడాది 36,126 కేసులు నమోదు కాగా 27,210 కేసులను ఛేదించారు. ఇక 2,562 సైబర్ కేసులు నమోదయ్యాయి. మానవ అక్రమ రవాణాకు సంబంధించి 58 కేసుల్లో 163 మంది అరెస్టు చేశారు. ఈ ఏడాది మొత్తంగా 5,241 కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయి. రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. నేరాల నివారణకు కమిషనరేట్ పరిధిలో కమ్యూనిటీ కెమెరాలు 14,710 ఉండగా, నేను సైతం కెమెరాలు 1,72,633 ఉన్నాయి. కమిషనరేట్ పరిధిలోని నేరాలకు సంబంధించి మొత్తం రూ.12.77 కోట్లు రికవరీ చేశారు. గతేడాదితో పోలిస్తే 2 శాతం రికవరీ రేట్ పెరిగింది. గేమింగ్ యాక్ట్‌పై 188 కేసులు నమోదు కాగా 972 మంది అరెస్టయ్యారు. 20 కేసుల్లో నిందితులకు జీవితఖైదు పడింది. అలాగే 2,900 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దయ్యాయి. గతేడాదితో పోలిస్తే 16 శాతం రోడ్డు ప్రమాద మరణాలు పెరిగాయి. ప్రమాదాల్లో 633 మంది మృతి చెందగా 3,205 మందికి గాయాలయ్యాయి. మానవ అక్రమ రవాణాకు సంబంధించి 56 కేసుల్లో 153 మంది అరెస్టయ్యారు. 71 మంది బాధితులకు విముక్తి కలిగించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన 271మంది జైలుకు వెళ్లారు. డ్రగ్స్‌కు సంబంధించి 282 కేసులు నమోదు కాగా 698 మందిని అరెస్ట్ చేశారు. 12మందిపై పిడి యాక్ట్ నమోదు చేశారు. పేకాట, బెట్టింగ్‌లలో 188 కేసులు నమోదు కాగా 972 మందిని అరెస్ట్ చేశారు. ఆరుగురిపై పీడీ యాక్ట్ నమోదైంది. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన 8,758 ఫిర్యాదుల్లో 4,643 పరిష్కారమయ్యాయి.

పెరిగిన కిడ్నాప్‌లు, హత్యలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోల్చితే మహిళలపై నేరాలు 6.65 శాతం తగ్గినప్పటికీ కిడ్నాప్‌లు, వరకట్నం వేధింపులు, హత్యలు పెరిగాయి. గతేడాది వరకట్నం హత్యలకు సంబంధించి 5 కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 6 కేసులు నమోదయ్యాయి. 2022లో నలుగురు మహిళలు హత్యకు గురికాగా, ఈ ఏడాది 12 మంది హత్యకు గురయ్యారు. గతేడాది 110 మంది మహిళలు కిడ్నాప్‌కు గురికాగా, ఈ ఏడాది 116 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. మహిళలపట్ల అసభ్యకరంగా వ్యవహరించిన కేసులు 673 కేసులు నమోదకాగా, ఈ ఏడాది 744కేసులు నమోదయ్యాయి. ఇక గత ఏడాది పోక్సో కేసులు 442 నమోదు కాగా ఈ ఏడాది 317 కేసులు నమోదయ్యాయి. ఈ సమావేశంలో అదనపు సిపిలు, నాలుగు జోన్ల డిసిపిలు, ఇద్దరు ఎస్ఒటి డిసిపిలు, సైబర్ డిసిపి, ఇద్దరు ట్రాఫిక్ డిసిపిలు, షీ టీం డిసిపిలతో పాటు ఎసిపిలు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

డిఎంకె నేత వ్యాఖ్యలు సరిగాదు

- దేశ సమైక్యతను అస్థిరపరిచే యత్నం : కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపి, బీహార్ నుంచి హిందీ మాట్లాడేవాళ్లు తమిళనాడుకు టాయిలెట్లు కడిగేందుకు వస్తారని డిఎంకె నేత వ్యాఖ్యానించడం అత్యంత దురదృష్టకరమనీ, ఆక్షేపణీయమని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి అన్నారు. అవకాశం దొరికినప్పుడల్లా భారతదేశ సమైక్యతను అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ప్రయత్నిస్తూనే ఉందని విమర్శించారు. సనాతన ధర్మానికి, హిందుత్వం, హిందీ మాట్లాడే ప్రజలకు కాంగ్రెస్ నేతృత్వంలోని పనికిరాని కూటమి ప్రమాదకరంగా మారుతోందని విమర్శించారు. బుధవారం ఈ మేరకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖను విడుదల చేశారు. మొదటి నుంచీ కాంగ్రెస్ ఇదే ధోరణితో ముందుకెళ్తున్నదని పలు ఉదహరణలతో వివరించారు.

రాములు మరణం సమాజానికి తీరని లోటు

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా, ఉపపర్యవేక్షణ అధికారిగా పనిచేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల మన్ననలు పొందిన నారగోని రాములు హఠాత్తుగా మరణించడం ఉపాధ్యాయ ఉద్యమానికి, సమాజానికి తీరని లోటు అని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. రాములు మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. గురువారం హైదరాబాద్‌లోని జామా ఉస్మానియాలోని రాములు స్వగృహం యందు ఆయన భౌతికకాయానికి టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్యతో కలిసి ఎమ్మెల్సీ నివాళలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో ఉద్యమ విస్తరణకు కృషి చేసిన రాములు మరణం సంఘానికి తీరని లోటని, వారి మరణం పట్ల టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటిస్తుందని తెలియచేశారు. రాములుకి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో యుటిఎఫ్ మాజీ నాయకులు మోతుకూరి నరహరి, రమణయ్య శాస్త్రి, మస్తాన్ రావు, దేవదాస్, వరప్రసాద్, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, జిల్లా అధ్యక్షులు రాజారావు, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, జిల్లా కార్యదర్శి విశాలి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

ముఠా నాయకుడిలా రేవంత్‌రెడ్డి మాటలు

- ఆరు గ్యారంటీలపై చిత్తశుద్ధి ఏదీ : దాసోజు శ్రవణ్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రేవంత్‌రెడ్డి సిఎంలాగా కాకుండా ఓ ముఠా నాయకుడిలా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. గత ప్రభుత్వం ఏడుపు ఆపి ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన పేరిట కొత్తగా దరఖాస్తుల స్వీకరణ టైంపాస్ కోసమేనని విమర్శించారు. తెల్లరేషన్ కార్డులున్నవారికే సంక్షేమ పథకాలు అని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఖజానాలో లంకె బింద ఉండదనీ, తెలంగాణ మొత్తం లంకె బిందనే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాలు పెట్టి అబాసుపాలైందని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలపై ఆరోపణలు చేసేముందు తాము అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎన్ని లక్షల కోట్ల రూపాయలు వెనక్కి వేసుకున్నారని నిలదీశారు. రైతు బంధు డబ్బులివ్వడం చేత కాని రేవంత్ గతంలో కూడా ఇలాగే జరిగేదని చెప్పి నవ్వుల పాలయ్యారన్నారు. పాలన అంటే పరనింద, పరుషజాలం వాడటం కాదని సూచించారు.

అనుమానాస్పదంగా తల్లీ కూతురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమానస్పద స్థితిలో తల్లీ కూతురు మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో కలకలం రేపింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల కిందట చెన్నై నుంచి వలస వచ్చిన మురుగన్-ధనలక్ష్మి(36) దంపతులు మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి దీపక్‌నగర్ ప్రాంతంలో ఉంటూ పాపడాలు, చెకోడీలు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి కుమార్తె జీవని (16), కుమారుడు సిద్ధు ఉన్నారు. కాగా, పని నిమిత్తం మురుగన్ బయటకు వెళ్లగా మంగళవారం అర్ధరాత్రి తల్లీకూతుళ్లు ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కొడుకు నిద్రలో ఉండడంతో గమనించలేకపోయాడు. ఉదయం లేచి చూసేసరికి అమ్మ, అక్క దూలానికి వేలాడుతూ కనిపించారు. బంధువులు, స్థానికులకు సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కాగా ఇంటిముందు తలుపు గడి పెట్టి ఉండగా వెనుక వైపు తెరిచి ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది. వ్యాపారం ముగించుకున్నాక రోజూ ఇంటికి తిరిగొచ్చే మురుగున్ బుధవారం మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. కాగా, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లికూతుళ్లది ఆత్మహత్యనా.. లేక మురుగన్ హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అమిత్‌షా రాక

పార్లమెంట్ ఎన్నికలపై శ్రేణులకు దిశానిర్దేశం

ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ : జి ప్రేమేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మండలాధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర నాయకులతో బిజెపి రాష్ట్రస్థాయి సమావేశాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోని కొంగర కలాన్‌లో గల శోక్ల కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్టు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారని పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డికె అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర ఇన్‌చార్జులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, శాసనసభ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపి ప్రకాశ్ జవదేకర్, తదితర నేతలు పాల్గొంటారని తెలిపారు. గురువారం ఉదయం అమిత్‌షా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరకుంటారని, అక్కడ నుంచి చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించుకుంటారని పేర్కొన్నారు. ఆ తర్వాత కొంగరకలాన్‌లోని రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొంటారని, అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షించి పార్లమెంట్ ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. వికాసిత్ భారత్ (సంకల్ప యాత్ర), అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ట (అయోధ్య సందర్శన) తదితర అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. అనంతరం బిజెపి శాసనసభ్యులతో సమావేశమవుతారని తెలిపారు.

గిన్నిస్ బుక్‌లో 'సుస్వితి'కు చోటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన సుస్వితి గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం రాత్రి కూచిపూడి కళా వైభవం పేరిట కూచిపూడి నృత్య ప్రదర్శన 3783 మంది నృత్యకారులతో జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న నూతక్కి రాము, జయలక్ష్మి దంపతుల కుమార్తె సుశ్వితకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన సుస్వితి.. డాక్టర్ స్వేత సీతారత్నం దగ్గర కూచిపూడి నేర్చుకుంది. సుస్వితి కమలాపురంలోని ప్రయివేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. గిన్నిస్ బుక్‌లో చోటు దక్కడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సుశ్వితను అభినందించారు.

సమాజాన్ని ప్రభావితం చేసిన బాపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కళలు మానవీయ విలువలు కనుమరుగై పోతున్న నేటి కాలంలో సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని శాసన సభ తొలి సభాపతి మధుసూదనా చారి అన్నారు. బాపు దర్శకత్వం వహించిన ముత్యాల ముగ్గు, శ్రీ రామ రాజ్యం వంటి సినిమాలు తరతరాల పాటు ప్రజలను ప్రభావితం చేస్తాయని అయన పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా నిలయం నిర్వహణ లో విఖ్యాత దర్శకుడు చిత్ర కారుడు బాపు 90 వ జయంతి వేడుకలు జరిగాయి ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి ప్రముఖ చిత్రకారుడు నృత్య రూపకాలు రచయిత బిన్ను (భమిడి పల్లి నరసింహా మూర్తి) ని బాపు పరిచయం చేసిన నటుడు సుదర్శన్‌ను సత్కరించి మాట్లాడారు. బాపులాంటి దర్శకుల అవసరం నేడు ఉందన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ గాయని హైమవతి భీమన్న మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో బాపు విశ్వనాథ్‌లది ప్రత్యేక యుగం అన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు మాట్లాడుతూ విభిన్న కార్యక్రమాలు చేయడంలో కళా నిలయం ప్రముఖమని చెప్పారు. వేదికపై దయానంద్ స్వామి, బ్రహ్మానందం, గంటి పిచ్చయ్య, మురళీధర్, వసంత రాయలు పాల్గొనగా సురేందర్ స్వాగతం పలుకగా కార్యదర్శి పుష్పలత నివేదిక సమర్పించారు తొలుత బాపి రాజు బృందం పాడిన పాటలు అలరించాయి.

తొలి తెలుగు కవి పాల్కురికి సోమనాధుడు

ప్రజాశక్తి - కల్చరల్

మహాభారతంను ఆంధ్రీకరించిన నన్నయను తెలితెలుగు కవిగా ప్రచారం వున్నప్పటికీ తెలంగాణ ప్రాంతీయుడు ఇన పాల్కురికి సోమనాధుడు బసవేశ్వర పురాణం స్వతంత్ర కావ్య రచనతో మొదటి తెలుగు కవిగా గుర్తింపు పొందారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా పాల్కురికి సోమనాధుడు సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ తెలుగు కన్నడ సంస్కృత మరాఠీ భాషా పదాలను తన కావ్య రచనలో ఉపయోగించి న సోమనాధుడు నాటి శివ కవుల యుగానికి చెందిన వారన్నారు.ద్విపద పద్య శైలిలో బసవ పురాణం,అనుభవ సారం తదితర ఖండ కావ్య రచనలో దిట్ట ఇన సోమనాథుని కొన్ని రచనలు అందుబాటులో లేవని తెలిపారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై పోర్వ న్యాయమూర్తి మధుసూదన్, కవి మిద్దె సురేష్, గాన సభ పాలక మండలి సభ్యురాలు భమిడి ఉష పాల్గొన్నారు

బిఎండబ్ల్యు కారులో మంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రన్నింగ్‌లో ఉన్న ఓ బిఎండబ్ల్యు కారులో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడిన ఘటన హైదరాబాద్‌లోని సచివాలయం వెనుక ఉన్న మింట్ కాంపౌండ్ వద్ద చోటుచేసుకుంది. అయితే డ్రైవర్ వెంటనే కారు దిగడంతో ప్రాణ నష్టం తప్పింది. వాహనాదారులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మింట్ కాంపౌండ్ వద్ద రన్నింగ్‌లో ఉన్న బిఎండబ్ల్యు కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే కారు నిలిపివేసి బయటకు వచ్చేశాడు. నిమిషాల వ్యవధిలో కారు మొత్తం మంటలు వ్యాపించాయి. జిహెచ్ఎంసి వాటర్ ట్యాంకర్, అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకుని అక్కడికి చేరుకునే లోపే వాహనం దగ్ధమైపోయింది. ఖైరతాబాద్ పోలీసులు మింట్ కాంపౌండ్ వద్దకు చేరుకుని కాలిపోయిన కారును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని కారులో మంటలు రావడానికి గల కారణాలేంటి అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.